

'నులి'మేద్దాం రండి!



జనగామ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 'నులిపురుగుల నివారణ' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నారు. ఇందు కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చిన్నారుల్లో పౌష్టికాహార లోపం, కడుపు నొప్పి, రక్తహీనతకు నులిపురుగులు కారణమవుతుంటాయి. చిన్నారుల పేగుల్లో తిష్టవేసి ఆహారంలోని పోషకాలను గ్రహిస్తూ నెమ్మదిగా వృద్ధి చెందుతాయి. వీటిలో నులిపురుగులు, ఏలికపాములు, నట్టలు అని రకాలు ఉంటాయి. ఇవి పేగుల్లో వృద్ధి చెంది మెల్లిగా రక్తంలోకి చేరి రక్తహీనతకు కారణం అవుతాయి. దీని వల్ల చిన్నారులు క్రమక్రమంగా తీవ్ర అనారోగ్యానికి గురవుతుంటారు. చిన్నారుల్లో ఈ తరహా అనారోగ్య సమస్యలను నివారించే లక్ష్యంతో ప్రభుత్వం ఏటా 'నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం' చేపడుతోంది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 19 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారికి అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చిన్నారులు, బాలలు, విద్యార్థులకు గురువారం(నేడు) అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. మిగిలిన పిల్లలకు ఈనెల 27న వేయనున్నారు.

జిల్లావ్యాప్తంగా 1,14,994 మందికి..

జిల్లాకేంద్రంలోని 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 104 సబ్ సెంటర్ల పరిధిలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ జరగనుంది. జిల్లావ్యాప్తంగా 695 అంగన్‌వాడీ కేంద్రాలు, 515 ప్రభుత్వ, 72 ప్రైవేటు స్కూళ్లు, 19 ప్రభుత్వ, 14 ప్రైవేటు కాలేజీలు, 3 టెక్నికల్ కాలేజీలు, 3 వొకేషనల్ కాలేజీల్లో అల్బెండజోల్ మందులను వేయనున్నారు. జిల్లాలో 1,14,994 మంది చిన్నారులు, బాలలను గుర్తించారు. వీరికి గానూ 1,26,445 మాత్రలను అందుబాటులో ఉంచారు. ఈ ట్యాబ్లెట్స్‌ను పీహెచ్‌సీల వారీగా ప్రభుత్వం సరఫరా చేసింది. మాత్రల పంపిణీలో కోసం జిల్లావ్యాప్తంగా 183 మంది ఏఎన్ఎంలు, 509 మంది ఆశా కార్యకర్తలను కేటాయించి వారికి అవగాహన కల్పించారు.

స్కూళ్లకు వెళ్లి పంపిణీ..

ప్రతీ అంగన్‌వాడీ సెంటర్, స్కూల్, కాలేజీకి వెళ్లి ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు అల్బెండజోల్ మాత్రలను వేస్తారు. మాత్రల పంపిణీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధానాలపై స్పష్టంగా సూచనలు చేశారు. వైద్యశాఖ మార్గదర్శకాల ప్రకారం 1 నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఈ మాత్రలు ఇస్తారు. 1-3 ఏళ్ల లోపు చిన్నారులకు సగం మాత్రను చెంచాలో పొడి చేసి కొంచెం నీరు కలిపి తాగిస్తారు. 3-19 ఏళ్ల లోపు చిన్నారులు, కిశోర బాలలకు పూర్తి మాత్రను ఇచ్చి బాగా నమలమని చెబుతారు. 3 ఏళ్ల నుంచి 10 ఏళ్ల వరకు పిల్లలకు పూర్తి మాత్ర మింగితే కొద్ది మందిలో గొంతులో ఇరుక్కోవడం జరుగుతుంటుంది. దీంతో మాత్రను నమిలి మింగమని చెబుతారు. మాత్ర వేసిన తర్వాత అతికొద్ది మందిలో స్వల్ప దుష్ఫలితాలు కన్పిస్తాయని దీనికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. కొద్ది మందిలో వికారం, వాంతులు, వీరేచనాలు అవుతాయని, ఇవి మరీ ఎక్కువగా ఉంటే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న, ఇతర మందులు వాడుతున్న వారికి, ఫిట్స్ ఉన్న వారికి అల్బెండజోల్ మాత్రలను వేయవద్దని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. అనార్యోగంతో ఉన్న వారికి మాత్రలు వేస్తే దుష్ఫలితాలు చూపే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

నేడు నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

- 1-19 ఏళ్ల లోపు వారికి అల్బెండజోల్ మాత్రల పంపిణీ
- జిల్లావ్యాప్తంగా 1,14,994 మంది గుర్తింపు

పరిశుభ్రతతో నివారణ



పిల్లలు పరిశుభ్రతను పాటించడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. సాధారణంగా అపరిశుభ్రత కారణంగా పిల్లల పేగుల్లోకి నులిపురుగులు ప్రవేశిస్తుంటాయి. మట్టిలో ఆడుకోవడం, అదే చేతులతో ఆహార పదార్థాలు తినడం వంటివి చిన్న పిల్లలు చేస్తుంటారు. దీని వల్ల మట్టిలో ఉన్న నులిపురుగులు నోటి ద్వారా చిన్న పేగుల్లోకి చేరి అక్కడ తిష్ట వేస్తాయి. పేగుల్లో ఉన్న ఆహార పోషకాలను గ్రహిస్తూ మెల్లిమెల్లిగా వృద్ధి చెందుతుంటాయి. దీని వల్ల చిన్నారుల్లో రక్త హీనత ఏర్పడుతుంది. నులిపురుగులు పెరిగి పెరిగి కడుపు నొప్పి, వాంతులు వీరేచనాలకు దారితీస్తుంది. ఒక్కోసారి చిన్నారులు తీవ్ర అనారోగ్యం బారిన పడే ప్రమాదం కూడా ఉంటుంది. నులిపురుగుల నిర్మూలన కోసం అల్బెండజోల్ మాత్రలను వేయడమే కాకుండా చిన్నారుల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని వైద్యులు చెబుతున్నారు. చేతులను, చేతి గోళ్లను శుభ్రం చేసుకునేలా, పరిశుభ్రమైన నీటిని తాగేలా వారికి చిన్నతనం నుంచే నేర్పించాలని అంటున్నారు.

నిర్ణీత వయసువారందరికీ మాత్రలు వేయాలి..


డాక్టర్ హరీశ్‌రాజ్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి



చిన్నారుల్లో నులిపురుగులను నివారించేందుకు గానూ 1-19 ఏళ్ల లోపు చిన్నారులు, విద్యార్థులకు తప్పకుండా అల్బెండజోల్ ట్యాబ్లెట్లను వేయించాలి. నులిపురుగులు చిన్నపేగుల్లోకి చేరి రక్త హీనత, పోషకాహార లోపాన్ని కలగజేస్తాయి. దీని వల్ల పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుంది. దీన్ని అరికట్టేందుకు గానూ ప్రభుత్వం ఏటా రెండు సార్లు అల్బెండజోల్ ట్యాబ్లెట్లను పంపిణీ చేస్తుంది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాలో 12 మండలాల పరిధిలో 1,14,994 మంది చిన్నారులు, విద్యార్థులకు మాత్రలు వేసేందుకు ఏర్పాట్లు చేశాం.

కడియం x ఇందిర

స్టేషన్ కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు



స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 19: మొన్నటి అసెంబ్లీ ఎన్నికల వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఎమ్మెల్యే కడియం శ్రీహరి వర్గీయుల మధ్య నువ్వా-నేనా అనేలా వర్గ విభేదాలు కనిపించేవి. తదుపరి సద్దుమణిగాయి. తర్వాత ఎంపీ ఎన్నికల సమయంలో కడియం తన కూతురు కావ్యతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఇందిర వర్గీయులు అసహనం వ్యక్తం చేశారు. అయినప్పటికీ అధిష్ఠానం ఆదేశాల మేరకు కలిసి పనిచేశారు. ఎంపీ ఎన్నికల సందర్భంగా కలిసి ప్రచారం నిర్వహించారు. కాగా, ఇటీవల మడికొండలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఎంపీ కడియం కావ్య విజయోత్సవ సభలో కడియం మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులు ఇందిర వర్గం అని, కడియం వర్గం అని మాట్లాడితే తోకలు కట్ చేస్తానని హెచ్చరించారు. మనమందరం సోనియాగాంధీ వర్గం, రాహుల్‌గాంధీ వర్గం కాంగ్రెస్ వర్గమని తేల్చి చెప్పారు. అయినప్పటికీ ఇందిర వర్గానికి చెందిన కొందరు కడియంకు దూరంగా ఉంటున్నారు.

వేర్వేరుగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

డివిజన్ కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి వర్గీయులు, నియోజకవర్గం ఇన్‌చార్జి సింగపురం ఇందిర వర్గీయులు వేర్వేరుగా జరుపుకోవడం చర్చనీయాంశంగా మారింది. యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఉదయం ఇందిర నివాసంలో జరుపుకోగా ఎంపీటీసీ సింగపురం దయాకర్, కాసాని బొందయ్య, ఘన్‌పూర్ పట్టణ అధ్యక్షుడు నీల శ్రీధర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కుందూరు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. కాగా సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు కడియం వర్గీయులుగా చెప్పుకునే నాయకులు హాజరయ్యారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో శ్రీహరి, ఇందిర వర్గీయులు కలిసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేశామని చెబుతున్నప్పటికీ వాస్తవాలు అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. బయటికి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు అంతా కలిసి ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ లోలోపల ఇద్దరి ముఖ్య అనుచరులు అంతర్మథనం చెందుతున్నారు. ఏది ఏమైనా మున్ముందు జరిగే స్థానిక సంస్థల ఎన్నికల వరకు గ్రూపులు బహిర్గతం కావడం ఖాయమని స్పష్టంగా తెలుస్తోంది.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదినం



రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

జనగామ కల్చరల్, జూన్ 19: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కేకు కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రధాన ప్రతిపక్ష హోదాలో ప్రజల హక్కుల కోసం పోరాటానికి సిద్ధమైన యువనాయకుడు రాహుల్‌గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో సర్వల నర్సింగరావు, చెంచారపు బుచ్చిరెడ్డి, బడికె ఇందిర కృష్ణస్వామి, వంగాల కళ్యాణి మల్లారెడ్డి, జక్కుల అనిత వేణుమాధవ్, గాదెపాక రామచంద్రం, బొట్ల శ్రీనివాస్, మేడ శ్రీనివాస్, ధర్మ గోవర్ధన్ రెడ్డి, జాఫర్ షరీఫ్, అయూబ్, జాయ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డీసీపీ



బాధ్యతలు స్వీకరించిన డీసీపీ రాజమహేంద్రనాయక్

జనగామ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జనగామ డీసీపీగా బి. రాజమహేంద్రనాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2010 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందిన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు డీఎస్పీగా 2011లో మొదటి పోస్టింగ్ పొందారు. అక్కడి నుంచి 2013లో ఉమ్మడి వరంగల్ జిల్లా సీసీఎస్ విభాగంలో డీఎస్పీగా వచ్చారు. ఆ తర్వాత ములుగు, మహబూబాబాద్ డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. 2017లో అదనపు ఎస్పీగా పదోన్నతిపై భూపాలపల్లి ఎస్పీగా పనిచేశారు. అనంతరం 2021లో ఎస్పీగా పదోన్నతి పొంది కరీంనగర్ ఇంటెలిజెన్స్ ఎస్పీగా వెళ్లారు. కాగా.. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన జనగామ డీసీపీగా వచ్చారు. ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన రాజమహేంద్రనాయక్‌ను వెస్ట్‌జోన్ పరిధిలోని ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు.



పోడియం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

నిరసనలు.. నిలదీతలు

- జనగామ మునిసిపల్ సమావేశంలో కౌన్సిలర్ల ఆగ్రహం
- అధికారుల నిర్లక్ష్యంపై సభ్యుల మండిపాటు
- పారిశుధ్య సిబ్బంది కొరతపై అసహనం
- పోడియం ఎదుట బైఠాయింపు

జనగామ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జనగామ మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున అధ్యక్షతన బుధవారం జరిగిన సాధారణ సమావేశం గరంగరంగా సాగింది. పట్టణంలో పారిశుధ్య సిబ్బంది కొరత, వార్డుల్లో అభివృద్ధి పనుల నిర్వహణ, అధికారుల నిర్లక్ష్యంపై సభ్యులు మండిపడ్డారు. పోడియం ఎదుట బైఠాయింపు, నిరసనలు, నిలదీతల నడుమ కౌన్సిల్ సమావేశం జరిగింది. బీజేపీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ మహంకాళి హరిశ్చంద్రగుప్త మాట్లాడుతూ వర్షాకాలంలో సమీపించిన నేపథ్యంలో పట్టణంలోని అంతర్గత రోడ్లపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చాలని సభ దృష్టికి తెచ్చారు. హోటళ్లలో పరిశుభ్రత పాటించడం లేదని, దీని వల్ల వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అన్నారు. హోటళ్ల పరిశుభ్రత పాటించేలా చూడాలని అన్నారు. మునిసిపాలిటీలో బిల్డింగ్ పర్మిషన్ సెక్షన్‌లో పూర్తి స్థాయిలో అధికారులు లేకపోవడంతో పర్మిషన్లు ఇవ్వడంలో జాప్యం జరుగుతోందని సభలో ప్రస్తావించారు. మునిసిపల్ పన్నులు, ట్రేడ్ లైసెన్సుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని 12వ వార్డు కౌన్సిలర్ గాదెపాక రాంచందర్ ప్రస్తావించారు. అధికారులు స్పందించి మునిసిపల్ ఆదాయం పెంచే విధంగా చూడాలన్నారు. రైల్వే చిన్న గేట్ వద్ద మురికినీరు నిలవడం వల్ల వాసనతో ప్రజలకు ఇబ్బందిగా ఉందని, ఈ విషయంపై ఎన్నిసార్లు చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని 11వ వార్డు కౌన్సిలర్ పాక రమ అన్నారు. సమావేశంలో భాగంగా 26 ఎజెండా అంశాలపై చర్చ జరగగా మెజారిటీ సభ్యులు ఆమోదం లేకపోవడంతో 5 ఎజెండా అంశాలను తిరస్కరించారు.

పారిశుధ్య సిబ్బంది కొరతపై నిరసన

జనగామ మునిసిపల్‌లో పారిశుధ్య సిబ్బంది కొరతపై కౌన్సిల్ సభ్యులు నిరసన తెలిపారు. పోడియం ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. పట్టణంలో పారిశుధ్య సిబ్బంది సరిపడా లేకపోవడంతో పారిశుధ్య పనుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని సిబ్బందిని పెంచాలని 24వ వార్డు కౌన్సిలర్ గంగరబోయిన మల్లేశ్ కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. దీనికి మిగతా సభ్యులు మద్దతు తెలుపుతూ పోడియం ఎదుట బైఠాయించారు. సిబ్బందిని పెంచేందుకు గానూ తీర్మానం చేసేందుకు

మిగతా 6వ పేజీలో..

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- విద్య, వైద్యం, సాగునీరు, రోడ్లపై ఫోకస్
- ఏడాదిలోగా ఘన్‌పూర్‌లో వంద పడకల ఆస్పత్రి
- దేవాదుల ద్వారా ప్రతీ ఎకరాకు సాగునీరు
- 21న కలెక్టరేట్‌లో విద్యారంగ సమస్యలపై సమీక్ష
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గడ్, జూన్ 19: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. తొలుత ప్రధాన అంశాలైన విద్య, వైద్యం, సాగునీరు, రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించినట్లు తెలిపారు. జఫర్‌గడ్‌లో విద్యాలయాల సందర్శన అనంతరం కస్తూర్బా ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో మంగళవారం భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాగునీటిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో దేవాదుల ప్రాజెక్టు, సాగునీటిపై ప్రస్తావించానన్నారు. ఇందుకు మంత్రి స్పందించి గోదావరి జలాలను పంటలకు అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారన్నారు. దీనికి తోడు సాగునీటి కాలువల నిర్మాణం, వాటి మరమ్మతులు చేపట్టేందుకు కార్యాచరణ జరుగుతోందన్నారు. నియోజకవర్గంలో రోడ్లు దెబ్బతిని అధ్వాన్నస్థితిలో ఉన్నాయని, వాటి మరమ్మతుతో పాటు అవసరమున్న చోట కొత్త రోడ్ల నిర్మాణానికి త్వరలోనే చర్యలు చేపడతామన్నారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు ఏడాదిలోగా స్టేషన్‌ఘన్‌పూర్‌లో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటయ్యేలా కృషి చేస్తానని అన్నారు. అంతేగాకుండా వైద్య పరికరాలు, మందుల సరఫరా, వైద్య సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకుంటానన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

21న విద్యారంగ సమస్యలపై సమీక్ష...

నియోజకవర్గంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై సమీక్షించేందుకు ఈనెల 21వ తేదీన కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కడియం తెలిపారు. కలెక్టర్‌తో పాటు విద్యాధికారులు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, ఎస్ఓలతో ఈ సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఐదు మండలాల్లోని విద్యాలయాల్లో ఉపాధ్యాయుల, బోధనేతర సిబ్బంది కొరత, వసతుల కల్పన, వంటి సమస్యలపై సమగ్రంగా చర్చించి వాటి పరిష్కారానికి తగు కార్యాచరణను రూపొందిస్తామని ఆయన వివరించారు.

ఈ సమావేశంలో సొసైటీ చైర్మన్ కరుణాకర్‌రావు, వైస్ ఎంపీపీ కనకయ్య, ఎంపీటీసీ దేవేందర్‌నాయక్, మార్కెట్ మాజీ చైర్మన్‌లు గుజ్జరి రాజు, అన్నెబోయిన భిక్షపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల అయిలయ్య, బానోత్ రాజేశ్‌నాయక్, ఇల్లందుల శ్రీనివాస్, కుల్ల మోహన్‌రావు, పి.సదయ్యగౌడ్, భూక్య రవి నాయక్, మొగిలి, కుల్ల రాజు, కన్న సోమశేఖర్, గాదరి బాబు, ఎల్లయ్య, కుక్కల సారంగం, తదితర, నాయకులు ఉన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

- రోగులకు మెరుగైన సేవలందించాలి
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశాలు
- ఎంసీహెచ్ వైద్యులతో సమీక్ష సమావేశం

జనగామ కల్చరల్, జూన్ 19: మాతా, శిశు సంరక్షణ ఆస్పత్రి వైద్యులు సమయపాలన పాటిస్తూ నిత్యం అందుబాటులో ఉండాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా ఆదేశించారు. బుధవారం ఆయన చంపక్‌హిల్స్ మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఓపీ బ్లాక్, ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ వార్డులు, ప్రసూతి గదులను, లేబర్‌వార్డు, ఓబీయూ యూనిట్లను పరిశీలించి న అనంతరం సుపత్రి వైద్యులు, సిబ్బందితో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు నిర్లక్ష్య ధోరణి వీడాలని, పేషెంట్లకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, గంటల తరబడి క్యూలో వేచి ఉండే పరిస్థితి తలెత్తకుండా ఆన్‌లైన్ ద్వారా ఓపీ సేవలు అందించాలని సూచించారు. రక్త నమూనాలు సరైన విధంగా సేకరించాలని, ఔషధాలు, ఇంజెక్షన్లు, గ్లూకోజ్ బాటిళ్లు సరిపడా ఉండేలా చూసుకోవాలని సూచించారు. రిజిస్టర్లలో వైద్యులు, సిబ్బంది ఫోన్ నంబర్లతో సహా నమోదు చేయాలన్నారు. అనంతరం మెడికల్ కాలేజీని సందర్శించారు. అన్ని విభాగాల తరగతి గదులను తనిఖీ చేసి మౌలిక వసతులు కల్పించాలని, ప్రయోగశాలలో సరిపడా సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. తదుపరి కోర్టు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ, హాస్టల నిర్మాణ పనులను పర్యవేక్షించారు. నాణ్యతతో పనులు చేయాలని, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా హాస్టల్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ మధుసూదన్‌రెడ్డి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ గోపాల్‌రావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంసీహెచ్‌లో వైద్యులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

కటకటాల్లోకి ఖాకీ!

మహిళా కానిస్టేబుల్‌పై అత్యాచారం కేసులో అరెస్టు

- కాళేశ్వరం ఎస్సై భవానిసేన్‌కు రిమాండ్
- ఉద్యోగం నుంచి డిస్మిస్?

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూన్ 19: గౌరవ ప్రదమైన స్థానంలో ఉండి ప్రజలను రక్షించాల్సిన ఓ పోలీస్ అధికారి తనతో పనిచేసే తోటి ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అతగాడి చర్యలతో విసుగుచెందిన బాధితురాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. వివరాల్లోకి వెళితే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఎస్సై భవానిసేన్‌గౌడ్ 20రోజుల క్రితం మహిళా కానిస్టేబుల్‌కు ఫోన్ చేసి తన కాలు స్లిప్ అయి జారిపడ్డానని చెప్పి తన గదికి రప్పించుకొని లైంగికంగా ప్రలోభానికి గురిచేశాడు. అతడి పోకడను పసిగట్టిన బాధితురాలు.. అక్కడి నుంచి తప్పించుకొని వెళ్లింది. మళ్లీ ఈ నెల 16వ తేదీన పాత కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో నిద్రిస్తున్న ఆమె ఇంట్లోకి రాత్రి 1 గంటకు అదే భవనం 2వ అంతస్తులో ఉంటున్న ఎస్సై భవానిసేన్ చొరబడి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె ప్రతిఘటించడంతో గన్‌ను గురిపెట్టి బెదిరించి అత్యాచారానికి ఒడిగట్టాడు.

సీఎం దృష్టికి..



కాళేశ్వరం ఎస్సై భవానిసేన్‌గౌడ్ లైంగిక వేధింపుల వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. వివిధ దినపత్రికలు, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆదికాస్తా సీఎం దృష్టికి వెళ్లింది. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకొని శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో జిల్లా పోలీసు యంత్రాంగం అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. వైద్య పరీక్షలు సైతం చేయించి అత్యాచారం నిజమేననే నిర్ధారణకు వచ్చారు. జరిగిన ఉదంతంపై జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే.. మల్టీజోన్ ఐజీ ఏవీ రంగనాథ్‌కు నివేదిక పంపించారు.

రేప్ కేసు

లైంగిక వేధింపులు నిజమేనని తెలిసిన వెంటనే ఆ ఎస్సై వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌ను జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్వాధీనం చేసుకున్నారు. భవానిసేన్‌పై ఐపీసీ 449,376(2)324, 506 సెక్షన్ల కింద రేప్ కేసు నమోదు చేశారు. అనంతరం అతడిని భూపాలపల్లి ఫస్ట్ క్లాస్ అడిషనల్ కోర్టులో బుధవారం రిమాండ్‌కు తరలించారు. మరోవైపు ఆయనను విధుల నుంచి తొలగించినట్లు ప్రభుత్వం

మిగతా 6వ పేజీలో..

రైతులకు కేంద్రం ఊరట

14 రకాల పంటలకు మద్దతు ధరల పెంపు

వరంగల్ వ్యవసాయం, జూన్ 19: మూడోసారి ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నరేంద్రమోదీ ప్రభుత్వం 14 రకాల పంటలకు మద్దతు ధరలను పెంచుతూ బుధవారం నిర్ణయం తీసుకుంది. కేంద్రం నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం వారణాసిలో ప్రధానమంత్రి కిసాన్ సామ్మాన్ నిధి పథకం 17వ విడత డబ్బులు రూ.20వేల కోట్లను నరేంద్రమోదీ రైతుల ఖాతా ల్లో జమ చేశారు. ఆ మరుసటి రోజే రైతులకు మరో మంచి వార్తను చెప్పడం విశేషం.

పెరిగిన పంట ధర

పంట	2024-25	పెంచినది
వరి ధాన్యం	రూ.2,300	117
వరి(ఏ గ్రేడు)	రూ.2,320	117
జొన్న	రూ.3,371	91
మక్కజొన్న	రూ.2,225	135
సజ్జలు	రూ.2,625	125
రాగులు	రూ.4,290	444
కందుల	రూ.7,550	550
పెసర్లు	రూ.8,682	124
మినుములు	రూ.7,400	450
వేరుశనిగ	రూ.6,783	406
సన్‌ఫ్లవర్	రూ.7,280	520
సోయా	రూ.4,892	292
నువ్వులు	రూ.9,267	632
ఒడిసెలు	రూ.8,717	983
పత్తి	రూ.7,521	501

కార్పెంటర్ యూనియన్‌కు సహకరిస్తాం..

కాశోజీ జంక్షన్, జూన్ 19 : కార్పెంటర్ యూనియన్‌కు అన్నివిధాలా సహకరిస్తామని జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. ఇటీవల నియమకమైన ఉమ్మడి జిల్లా కార్పెంటర్ యూనియన్ నూతన కార్యవర్గ నాయకులు బుధవారం హనుమకొండ సుబేదారిలోని కార్మికశాఖ కార్యాలయంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ రమేష్‌బాబును కలిసి గత కార్యవర్గాన్ని మార్చుతూ సర్వీస్ కాపీలో మార్పులు చేసి సర్టిఫైడ్ కాపీలు ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పెంటర్ యూనియన్ తరఫున రమేష్‌బాబు జన్మదినం సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. డిప్యూటీ లేబర్ కమిషనర్‌ను కలిసిన వారిలో కార్పెంటర్ యూనియన్ కన్వీనర్ వీణవంక సదానందం, అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవో రమాదేవి నుంచి పదోన్నతి ఉత్తర్వులు అందుకుంటున్న ఉపాధ్యాయుడు

పదోన్నతుల ఆర్డర్లు అందుకున్న ఉపాధ్యాయులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 19: ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో భాగంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు ఉత్వర్వులు అందుకున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని ఆయా మండలాల ఎంఈవోలు పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు బుధవారం ఉత్తర్వులు అందజేశారు. వరంగల్ జిల్లాలో అన్ని కేటగిరీల్లో కలిపి 434 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు సాధింగా, హనుమకొండ జిల్లాలో 454 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. అయితే వరంగల్ జిల్లాలో మాత్రం రోస్టర్ పాయింట్లలో తలెత్తిన సాంకేతిక కారణాలతో ప్రభుత్వ విభాగంలోని పీఈటీలు, లోకల్ బాడీలోని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలతో పాటు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు బుధవారం రాత్రి వరకు ఇంకా పూర్తి కాలేదు.

ఆర్టీసీ ఆర్ఎంగా విజయభాను బాధ్యతల స్వీకరణ

బాలసముద్రం, జూన్ 19: టీజీ ఎస్ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్‌గా డి. విజయభాను మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ చార్మినర్ డివిజన్ డిప్యూటీ రీజినల్ (ఆపరేషన్స్) మేనేజర్‌గా పనిచేసి పదోన్నతిపై వరంగల్ ఆర్ఎంగా వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఎం విజయభానును డిప్యూటీ రీజినల్ మేనేజర్ కె.భానుకిరణ్, డిపో మేనేజర్‌లు ఆర్ఎంకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డీబార్

కేయూ క్యాంపస్, జూన్ 19: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య కేంద్రం డిగ్రీ కోర్సుల పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు ప్రాక్టీస్‌కు పాల్పడగా తనిఖీ అధికారులు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్ బుధవారం తెలిపారు. డీబారైన వారిలో హనుమకొండ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్స్ సైన్స్ కళాశాలలో ఇద్దరూ ఉన్నట్లు పేర్కొన్నారు. వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కేయూలో వినియోగదారుల అధ్యయన కేంద్రం

జాతీయ వినియోగదారుల సమావేశంలో డిమాండ్


వినతి పత్రం అందచేస్తున్న చక్రపాణి

హనుమకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ విశ్వవిద్యాలయంలో వినియోగదారుల అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఢిల్లీలో జరుగుతున్న వినియోగదారుల జాతీయ సమావేశాల్లో ప్రధానంగా చర్చకు వచ్చింది. కన్స్యూమర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రం పక్షాన పాల్గొన్న జాతీయ వినియోగదారుల మండలి ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి ఈ అంశాన్ని లేవనెత్తారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో వినియోగదారుల అధ్యయన కేంద్రం లేకపోవడం లోటుగా ఉందన్నారు. వినియోగదారుల ఉద్యమం చురుకుగా సాగుతున్న వరంగల్‌లోని కేయూలో వినియోగదారుల హక్కుల రక్షణ, చైతన్యానికి అధ్యయన కేంద్రాన్ని తప్పక ఏర్పాటు చేయాలని కోరారు. ఈమేరకు ఒక తీర్మానాన్ని కూడా ఆయన ప్రవేశపెట్టారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యదర్శి నిధి ఖరేకు వినతి పత్రాన్ని కూడా సమర్పించారు. వినియోగదారుల జాతీయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్, క్యాట్కో చైర్మన్ శంకర్ లాల్ చౌరసాయి, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పెండోట అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్ ఈ సందర్భంగా పాల్గొన్నారు. సమావేశాలకు సీసీఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అనంత్ శర్మ అధ్యక్షత వహించారు.

పంతుళ్ల పదోన్నతుల్లో గందరగోళం

● పదోన్నతులు చేపట్టినా 40 శాతం ఖాళీలే.. ● పోస్టులున్నా అప్‌గ్రేడ్ కాని పండితులు ● పదోన్నతులు రాక నైరాశ్యంలో కొంత మంది ఎస్జీటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 19: విద్యాశాఖలో నిర్వహిస్తున్న పంతుళ్ల పదోన్నతుల ప్రక్రియ గందరగోళంగా ముగియనుంది. పదోన్నతులు చేపడితే ఖాళీలు భర్తీఅయ్యి అర్హత ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతులు లభిస్తాయనే ఆశలు అడియాశలే అయ్యాయి. 25 ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న వారిలో కొంతమందికి ఈ సారి పదోన్నతుల ప్రక్రియ సైతం నిరాశే మిగిల్చింది. ఎస్జీటీ, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఒకటి కంటే ఎక్కువ పదోన్నతులు సాధించిన ఉపాధ్యాయులు ఒకే చోటుకు వెళుతుంటే.. మిగతా చోట్ల ఖాళీలు అలాగే ఉంటున్నాయి. దీంతో జిల్లాల్లో 40శాతం ఖాళీలు ఏర్పడుతున్నట్లు ఉపాధ్యాయులు వాపోతున్నారు. అర్హత సాధించినప్పటికీ కొంతమంది పండిట్లు ఉన్నతీకరణకు నోచుకోవడం లేదు. సీనియారిటీ జాబితా ప్రకారం ముందుగానే ఒకటి కంటే ఎక్కువ పదోన్నతుల ఆప్షన్లు ఎంపిక చేసుకోవడంతో కొంతమందికి పదోన్నతులకు అవకాశం లేకుండా పోయింది.

ఇదిలాఉండగా, వరంగల్ జిల్లాలో ఐదుగురు తెలుగు పండిట్లు ఉన్నతీకరణకు నోచుకోలేదు. హనుమకొండ జిల్లాలో 12 మంది తెలుగు పండిట్లు, 13మంది హిందీ పండిట్లు ఉన్నతీకరణకు నోచుకోలేదు. ఇక వరంగల్ జిల్లాలో మాత్రం రోస్టర్ పాయింట్లలో తలెత్తిన సాంకేతిక కారణాలతో ప్రభుత్వ విభాగంలోని పీఈటీలు, లోకల్ బాడీలోని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలతో పాటు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు బుధవారం రాత్రి వరకు ఇంకా పూర్తి కాలేదు. మొత్తంగా ఈ సారి పదోన్నతుల ప్రక్రియ సైతం గందరగోళంగానే ముగుస్తున్నట్లు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, వరంగల్‌జిల్లాలో అన్ని కేటగిరీలల్లో కలిపి మొత్తం 434 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు సాధించగా, హనుమకొండ జిల్లాలో 454 మంది ఉపాధ్యాయులు పదోన్నతి పొందారు.

40 శాతం ఖాళీలే..

పదోన్నతుల ప్రక్రియలో ఎస్జీటీ, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయులను స్కూల్ అసిస్టెంట్లుగాను, పండిట్లు, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా పదోన్నతులు కల్పిస్తుంటే ఈ ప్రక్రియలో సైతం 40 శాతం ఖాళీలు ఏర్పడనున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఎస్జీటీ, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయులకు వారి అర్హతలను బట్టి రెండు, మూడు పదోన్నతులు వస్తున్నాయి. వారికి ఆ మేరకు ఉత్తర్వులు అందజేయడంతో వారు ఒకే ఒక పోస్టులో చేరనున్నారు. దీంతో మిగతా రెండు పోస్టులు ఖాళీలు ఏర్పడనున్నాయి. ఇలా ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు సాఫ్ట్‌వేర్‌లో ఏర్పాటు చేయకపోవడంతో మళ్లీ పదోన్నతుల ప్రక్రియ జరిగేంత వరకు ఆ పోస్టులు ఖాళీలుగానే ఉండనున్నాయి. ఈ రకంగా సుమారుగా 40 శాతం ఖాళీలు అలాగే ఉండనున్నాయి.


అప్‌గ్రేడ్ కాని కొంత మంది పండితులు

దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించలేదు అన్న చందంగా తయారయ్యింది రెండు జిల్లాల్లో పండితుల పరిస్థితి. జిల్లాల వారిగా కేడర్ స్ట్రెంత్ ప్రకారం పండితుల పోస్టులు అప్‌గ్రేడ్ అయినా అర్హత కలిగిన పండిట్లలో కొంతమందికి మాత్రం ఉన్నతీకరణ లేకుండా మొండిచేయే మిగిలింది. పోస్టులు అప్‌గ్రేడ్ అయినా కొంత మంది ఎల్పీలు మాత్రం అప్‌గ్రేడ్ కాలేదు.

వరంగల్ జిల్లాలో ఇలా...

వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ విభాగంలో 16 ఎల్పీ తెలుగు పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. 8 మంది ఉపాధ్యాయులు ఉండగా, అందులో 5గురు ఉపాధ్యాయులకు మాత్రమే ఉన్నతీకరణ పోస్టుల్లో అవకాశం దక్కింది. మరో ముగ్గురు ఉపాధ్యాయులకు అవకాశం దక్కలేదు. వీరికి రోస్టర్ పాయింట్ల ప్రకారం ఉన్నతీకరణ దక్కడం లేదని అధికారులు చెబుతుంటే అధికారుల పొరపాటు వల్లనే తమకు ఉన్నతీకరణ దక్కలేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

హనుమకొండ జిల్లాలో ఇలా...



హనుమకొండ జిల్లాలో పరిస్థితి మరోలా ఉంది. ఎల్పీ తెలుగులో మొత్తం 103 పోస్టులుం డగా, అందులో 90 పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. అయితే ఇందులో 90 మందికి మాత్రమే ఉన్నతీకరణ అవకాశం దక్కగా, మరో 12 మంది ఎల్పీ తెలుగు ఉపాధ్యాయులకు నిరాశే మిగిలింది. ఇక హిందీ పండిట్ల విషయంలోనూ ఇదే మాదరిగా జరిగింది. 106 పోస్టులుండగా అందులో 94 మందికి ఉన్నతీకరణ అవకాశం దక్కగా మరో 12 మందికి ఉన్నతీకరణ అవకాశం దక్కలేదు.

వింత పరిస్థితి

పదోన్నతుల ప్రక్రియ విద్యాశాఖలో వింత పరిస్థితిని నెలకొల్పింది. ఎల్పీల ఉన్నతీకరణలో భాగంగా కొన్ని పాఠశాలల్లో పోస్టు ఉన్నతీకరణ అయ్యింది. అయితే అక్కడ పనిచేస్తున్న సదరు ఉపాధ్యాయులకు మాత్రం ఉన్నతీకరణ దక్కలేదు. దీంతో ఉన్నతీకరణ అర్హత పొందిన ఉపాధ్యాయులు అదే పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుంది. అక్కడే ఉన్నతీకరణ పొందని ఉపాధ్యాయులు సైతం పనిచేయాల్సి ఉంటుంది.

ఇవీ ఉదాహరణలు

వరంగల్ మండల పరిధిలోని కృష్ణకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న హిందీ పండిట్ పోస్టు అప్‌గ్రేడ్ అయ్యింది. ఆ పోస్టులో పనిచేస్తున్న హిందీ పండిట్‌కు మాత్రం అప్‌గ్రెడేషన్ దక్కలేదు. దీంతో అప్‌గ్రేడ్ అయిన ఎల్పీతో పాటు అక్కడ ప్రస్తుతం పనిచేస్తున్న ఎల్పీ సైతం పనిచేయాలి. కమలాపూర్ మండలంలోని మాదన్నపేట పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఎల్పీకి ఉన్నతీకరణ అవకాశం దక్కలేదు. కానీ పోస్టు మాత్రం ఉన్నతీకరణ అయ్యింది. దీంతో అక్కడ పనిచేస్తున్న ఎల్పీతో పాటు అప్‌గ్రేడ్ అయిన ఎల్పీ సైతం ఇక్కడే పనిచేయాల్సి ఉంది. అయితే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న చోట ఇద్దరు ఎల్పీలు పనిచేయడం గమనార్హం.

జిల్లాల వారిగా పదోన్నతులు ఇలా...

	కేటగిరి	ప్రభుత్వ	లోకల్‌బాడి
వరంగల్ జిల్లాలో...	పీఎస్‌హెచ్‌ఎం(ఎల్ఎఫ్ఎల్)	7	56
	ఎస్ఏ ఇంగ్లీష్	5	10
	ఎస్ఏ గణితం	1	20
	ఎస్ఏ తెలుగు	5	105
	ఎస్ఏ బయోసైన్స్	7	22
	ఎస్ఏ హిందీ	5	88
	ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	10	42
	ఎస్ఏ ఫిజికల్ సైన్స్	1	2
	ఎస్ఏ సోషల్ స్టడీస్	10	38
	మొత్తం	**41**	**393**
హనుమకొండ జిల్లాలో...	పీఎస్‌హెచ్‌ఎం(ఎల్ఎఫ్ఎల్)	5	44
	ఎస్ఏ తెలుగు	3	87
	ఎస్ఏ హిందీ	6	88
	ఎస్ఏ ఇంగ్లీష్	4	13
	ఎస్ఏ గణితం	3	31
	ఎస్ఏ ఫిజికల్ సైన్స్	1	7
	ఎస్ఏ బయోసైన్స్	5	40
	ఎస్ఏ సోషల్ స్టడీస్	7	48
	ఎస్ఏ ఉర్దూ	2	0
	ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	8	48
	ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్	0	1
	మొత్తం	**47**	**407**

ఒకే రాష్ట్రంలో రెండు విధానాలు సరికాదు..

డాక్టర్ ఎ. సదయ్య, ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి

ఒకే రాష్ట్రంలో రెండు విధానాలు సరికాదు. మల్టీజోన్-2లో రోస్టర్ పాయింట్ల ఆధారంగా అర్హత కలిగిన ఎల్పీలందరికీ ఉన్నతీకరణకు అవకాశం ఇస్తుంటే మల్టీజోన్-1లో మాత్రం పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. కానీ అందరికీ ఉన్నతీకరణ అవకాశం మాత్రం కల్పించడం లేదు. అధికారులు, ప్రభుత్వం పునరాలోచించి ఎల్పీలందరిని ఉన్నతీకరణ చేయాలి.

అర్హులైన ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలి

పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మన్నె చంద్రయ్య

అర్హులైన ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మన్నె చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ డీఈవో కార్యాలయం ముందు పలువురు ఉపాధ్యాయులతో ఆయన నిరసన వ్యక్తం చేశారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పలువురు ఎల్పీలకు ఉన్నతీకరణకు అవకాశం రాకపోవడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అర్హులైన వారందరికి న్యాయం చేకరూర్చాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రూ.650 కోట్లతో బడ్జెట్?

నేడు బల్దియా ప్రత్యేక సమావేశం ● హాజరు కానున్న మంత్రి, ఎమ్మెల్యేలు


కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్లు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 19: వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం బడ్జెట్ సమావేశం జరుగనుంది. ఈ బడ్జెట్ సమావేశంలో 2024- 2025 సంవత్సరానికిగాను రూ.650కోట్ల నిధుల ప్రతిపాదనలు, అమోదంపై సమీక్ష జరుగనుందని విశ్వసనీయంగా తెలిసింది. అయితే ఈ యేడు ఎన్నికల కోడ్ రావడంతో మూడు మాసాలు గడిచి పోవడం వల్ల 9 నెలలకే ఈ బడ్జెట్ వర్తిస్తుందని చెప్పకొస్తున్నారు. మేయర్ గుండు సుధారాణి నిర్లక్ష్యం వల్లనే ఇప్పటి వరకు ఈ యేడు బడ్జెట్ సమావేశం, ప్రకటనలో జాప్యం జరిగిందని కొందరు కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. అయితే గత 2023-2024 బడ్జెట్‌లో రూ.523కోట్లు ప్రకటించారు. బల్దియాకు వివిధ రకాల ట్యాక్సీలు, భవనాల అద్దెల రూపంలో వచ్చే ఆదాయంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు వస్తాయి. సుమారు వంద కోట్ల వరకు బల్దియాకు పన్నుల రూపంలో సొంత ఆదాయం రాగా, మిగతా నిధులు ఎమ్మెల్యే, ఎంపీల్యాడ్స్‌తో పాటు నగర పాలక సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కేటాయిస్తుంది. ఈ నిధులతో సిబ్బంది జీతాలు, విలీన గ్రామాల అభివృద్ధి, శానిటేషన్, లోతట్టు ప్రాంతాల అభివృద్ధి, రోడ్లు, డ్రేనేజీల నిర్మాణం చేపట్టనున్నారు.

మంత్రి, ఎమ్మెల్యేలు హాజరు

బల్దియాలో జరిగే బడ్జెట్ సమావేశానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిలకు బల్దియా నుంచి రెండు రోజుల ముందుగానే ఆహ్వానం పంపించినట్లు తెలిసింది. వీరు సమావేశానికి హాజరై వరంగల్ నగరం అభివృద్ధిపై అంచనాలు, వ్యయంపై చర్చిస్తారు. ప్రధానంగా 66 డివిజన్‌లలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసే ఆలోచనలో మంత్రి, ఎమ్మెల్యేతోపాటు మేయర్ ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

సమావేశంపై నీలినీడలు?

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశం గురువారం బల్దియా కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు జరుగనుంది. ఈ సమావేశం నిర్వహణపై నాలుగు రోజుల ముందుగానే బల్దియా సర్వసభ్య సమావేశంలో సెక్రెటరీ విజయలక్ష్మి ప్రకటించారు. కాగా, రాష్ట్రంలో చాలా మున్సిపాలిటీలలో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ప్రభుత్వ అనుమతితో బడ్జెట్ సమావేశాలు నిర్వహించాయి. శాఖాపరంగా రావలసిన రాబడి, పోబడి గుర్తించి ప్రకటించి అమలు పరిచారు. కానీ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2024-25 బడ్జెట్ ప్రకటించలేదు. అయితే కావాలనే మేయర్ బడ్జెట్ ప్రకటన జాప్యం చేసిందని పాలక వర్గంలోని కొందరు అసంతృప్త వర్గం కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. అయితే గురువారం బల్దియా బడ్జెట్ సమావేశంపై నీలినీడలు అలుముకున్నాయి. అసంతృప్త కార్పొరేటర్లు బల్దియాలో బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరించనున్నట్లు తెలిసింది. ఇదిలా వుండగా, బీఆర్ఎస్ నుంచి మేయర్‌గా గెలిచి కాంగ్రెస్ పార్టీ నుంచి బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనడానికి సుధారాణి అనర్హురాలని వారు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బుధవారం కమిషనర్ అశ్విని తానాజీని కలిసి వినతి పత్రం సమర్పించారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 19: పాలిసెట్ కౌన్సిలింగ్ ప్రక్రియ ఈ నెల 20 (గురువారం) నుంచి ప్రారంభం కానున్నట్లు పాలిసెట్-2024 వరంగల్ కన్వీనర్ డాక్టర్ బైరి ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 20 నుంచి 24 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్స్ కోసం స్లాట్‌లను బుక్ చేసుకోవాలని తెలిపారు. స్లాట్‌లు బుక్ చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 22 నుంచి 25 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. 22 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఉంటుందని, 30న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. 30 నుంచి జూలై 4 వరకు వెబ్‌పోర్టల్ ద్వారా అడ్మిషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పెంపు

హనుమకొండ కలెక్టరేట్, జూన్19: వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ (గుర్తింపుకార్డు) గడువును సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల కోసం రెండేళ్లకోసారి అక్రిడిటేషన్ కార్డుల సదుపాయం రాష్ట్ర సమాచార శాఖ కల్పిస్తుంది. ఆ గడువు ఈ నెల 30వ తేదీతో ముగుస్తుండటంతో గడువు తేదీని 3నెలలు (సెప్టెంబర్ 30వరకు) పొడిగించినట్లు హనుమంతరావు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం

వరంగల్ మెడికల్, జూన్ 19: జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని ఈ నెల 20న నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ బీసాంబశివరావు తెలిపారు. 1 నుంచి 19 యేళ్ల వయస్సు గల పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా నులి పురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు ఇప్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ మాత్రలో భోజనం అనంతరం ఇస్తారన్నారు. ఈ మాత్రల వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. ఏవైనా కారణాలతో అందుబాటులో లేని పిల్లలకు ఈ నెల 27వ తేదీన మాప్ ఆప్ డే రోజు ఇస్తారన్నారు. హనుమకొండలోని బీఈడీ కాలేజీ పక్కన ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 12.30 గంటలకు ఈకార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు.

గురుకులాలను పరిశీలించిన కడియం

బాలికలతో మమేకమై చదువు, విద్యాబోధనపై చర్చ



జఫర్‌గడ్ గురుకులంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

జఫర్‌గడ్, జూన్ 19: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం జఫర్‌గడ్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించి, విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య, కంప్యూటర్ ల్యాబ్, అందులో వర్షాలకు సీలింగ్ ఊడిపోయిన పైకప్పు, వసతి సౌకర్యాలను పరిశీలించారు. కస్తూర్బాలో వంట గది, వండుతున్న ఆహార పదార్థాలను, స్టోర్ రూంలో సరుకుల నిల్వలను పరిశీలించారు. అలాగే విద్యాలయాల తరగతి గదులకు వెళ్లి బాలికలచే మమేకమై ఇంగ్లీషు, తదితర సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి.. వారిచే సమాధానాలను బోర్డుపై రాయించారు. చదువు, విద్యాబోధన, వసతి సౌకర్యాలు, మెను ప్రకారం అల్పాహారం, పాలు, భోజనం అందిస్తున్నారా..? వంటి అంశాలపై విద్యార్థులను అడిగారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని బాలికలకు ఉద్బోధించారు. సమస్యలు ఉంటే తనకు చెప్పాలని సూచించారు. ఇటీవలి టెన్త్ వార్షిక ఫలితాలను తెలుసుకుని.. గురుకులం, కస్తూర్బా విద్యాలయాల్లో ఏ ఒక్క విద్యార్థిని కూడా 10/10 గ్రేడు సాధించక పోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి..

ఈ సందర్భంగా ఆయన గురుకులం, కస్తూర్బా విద్యాలయాల్లో ఉపాధ్యాయ సిబ్బందిచే సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. పేద, మధ్య తరగతి పిల్లలకు నాణ్యమైన విద్యనందించి తద్వారా విద్యాభివృద్ధి, వారి ఉజ్జ్వల భవిష్యత్ కోసం.. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. వారి ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. విద్యార్థుల చదువు పట్ల శ్రద్ధతో, బాధ్యతగా పని చేయాలన్నారు. కాగా, కస్తూర్బా విద్యాలయంలో బోరు మోటారు కాలిపోయిందని ఎస్‌వో స్వప్న ఎమ్మెల్యే కడియం దృష్టికి తీసుకురాగా, వెంటనే ఆయన మిషన్ భగీరథ డీఈ కృపాకర్‌కు ఫోన్ చేసి రెండు రోజుల్లో మోటర్ బిగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పింఛన్ కోసం మహిళ విజ్ఞప్తి..

తనకు ఐదేళ్లుగా పింఛన్ రావడం లేదని.. పింఛన్ ఇప్పించేలా చూడాలని మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన నక్క యాదమ్మ అనే మహిళ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని వేడుకున్నారు. ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా యాదమ్మ ఆయనకు వద్దకు వచ్చి తన భర్త చనిపోయి ఐదేళ్లయిందని, పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా.. ఇప్పటి వరకు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కడియం.. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న తహసిల్దార్‌ను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే వెంట మండల తహసిల్దార్ అంబటి ఆంజనేయులు, గురుకులం వైస్ ప్రిన్సిపాల్ నర్మద, కస్తూర్బా ఎస్ఓ స్వప్న, సొసైటీ చైర్మన్ కరుణాకర్‌రావు, వైస్ ఎంపీపీ కనకయ్య, ఎంపీటీసీ దేవేందర్‌నాయక్, తదితరులు ఉన్నారు.



ఘన్‌పూర్‌లో ఇందిర కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఎమ్మెల్యే కడియం కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



పాలకుర్తిలో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా రాహుల్ బర్త్‌డే వేడుకలు

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 19: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిర కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కుందూరు శ్రీనివాస్ రెడ్డి, సింగపురం దయాకర్, కాసాని బొందయ్య, నీల శ్రీధర్, సింగపురం నాగయ్య, నక్క పాపయ్య, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

మహిళ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా మహిళ కాంగ్రెస్ కార్యదర్శి వడ్లూరి మౌనిక ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షులు షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాహుల్‌గాంధీ బర్త్‌డే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జూలకుంట్ల శిరీష్‌రెడ్డి, బెలిదె వెంకన్న, ఇనుగాల వెంకటేశ్వర్ రెడ్డి, కొలిపాక సతీష్, బత్తిని రాజుగౌడ్, ఎంపీటీసీ గుర్రం రాజు, నీల గట్టయ్య, మేకల మల్లేషం, చింత ఎల్లయ్య, సింగపురం వెంకటయ్య, పల్లె రవీందర్, మంద రాజు గుర్రం ఫాతికుమార్, ఐలపాక శ్రీనివాస్, వసంత్, జ్యోతి రెడ్డి, చిగురు సరిత, తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్ గాంధీ బర్త్‌డే కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమార స్వామి, నాయకులు చిలువేరు కృష్ణమూర్తి, భార్గవ్, భాస్కర్, పోగు శ్రీనివాస్, ఐలేష్ యాదవ్, మహేష్, కమ్మగాని నాగయ్య, పాల్గొన్నారు.

తరిగొప్పుల: ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ మండలాధ్యక్షుడు వగలబోయిన యాదగిరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామెర లూక, దండెం ప్రకాశం, గాదెపాక శ్రీను, తలకొక్కుల రవి, ఎడ్ల నవీన్, నరేందర్ రెడ్డి, ఎర్ర సిద్దులు, శెట్టే సదయ్య, దామెర ఏసేబు తదితరుల పాల్గొన్నారు.

జఫర్‌గడ్: స్థానిక గాంధీ సెంటర్‌లో రాహుల్ చిత్ర పటం వద్ద పార్టీ నాయకులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నూకల అయిలయ్య, నాయకులు అన్నెబోయిన బిక్షపతి, మంచాల ఎల్లయ్య, పట్టపుర్తి సదయ్యగౌడ్, కుల్ల మోహన్‌రావు, ఎడ్ల వెంకటయ్య, రాజెందర్, కన్న సోమశేఖర్, ఎల్లగౌడ్, నీలం రాజయ్య, సత్యనారాయణ, యాతం నర్సింహులు, నర్సింగం, నర్సయ్య పాల్గొన్నారు

రఘునాథపల్లి: రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బొల్లం అజయ్‌మణికంఠ, పీహెచ్‌సీ వైద్యాధికారి కమలహాసన్, నాయకులు మేకల నరేందర్, గాదె మహేందర్ రెడ్డి, కొలిపాక మల్లేష్, గొల్లూరి పృథ్వీరాజ్, గుగులోతు కొంరెల్లి, రాజ్‌కుమార్, రంగు రాజు, బాలు పాల్గొన్నారు.

కొడకండ్ల: కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మండలపార్టీ అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ధరావత్ రాజేష్ నాయక్, నూనెముంతల సోమ నర్సయ్య, జగన్నాధం, రమేశ్, రాము, భిక్షపతి, ఐత రాజు, వంశీకృష్ణ, ధరావత్ హేమాని, శ్రీనివాస్, అనిల్ రెడ్డి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా దేవరుప్పుల చౌరస్తా వద్ద పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ధర్మారెడ్డి, యాకస్వామి, కాడబోయిన గణేష్, నాగరాజు, రెడ్డి రాజుల రమేష్, మహ్మద్ రసూల్, ఓడపెల్లి రవీందర్, పుల్లయ్య, రతన్, సత్తయ్య, నర్సయ్య, వెంకన్న, అశోక్, గంగరాజు, సురేష్, భాస్కర్, రవి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నర్మెట: రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గొల్లపల్లి కుమారస్వామి, గొల్లపల్లి బాలచందర్‌గౌడ్, గొల్లపల్లి అంజయ్య, ప్రజ్ఞాపురం శ్రీధర్, గాదె మోహన్‌రెడ్డి, చెవుల పరుశరాములు, భూక్యా జయరాం, వలబోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిలుపూర్: రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలను చిలుపూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్ నేతృత్వంలో స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో మామిడాల యాదవరెడ్డి, తీగల మహేందర్, పాశం శిరీష -సురేశ్, పోలేపల్లి రంజిత్ రెడ్డి, మామిడాల లింగారెడ్డి, రంగు రమేష్, రవిందర్‌రెడ్డి, పవన్, ఏడవెళ్ళి మల్లారెడ్డి, తౌటి సునిల్, మాలోతు రాజునాయక్, మర్రి దుర్గాప్రసాద్, తాళ్ళపల్లి బుచ్చయ్య, నరేష్, కొయ్యడ శోభ, దార మహేందర్, ఇల్లందుల యాదగిరి, జక్కుల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా బచ్చన్నపేట చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. దేశం కోసం అహర్నిశలు పాటు పడుతున్న రాహుల్‌గాంధీ నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

దూరవిద్య పరీక్షల్లో అడ్డదారులు

- విద్యార్థులను పాస్ చేయించేందుకు డబ్బులు వసూలు
- మధ్యవర్తుల ద్వారా ఒకరికి బదులు మరొకరితో పరీక్ష
- భువనగిరికి చెందిన ఓ కాలేజీ కరస్పాండెంట్ చక్రం తిప్పుతున్నట్లు అనుమానాలు

జనగామ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దూర విద్య పరీక్షల్లో విద్యార్థులను పాస్ చేయించేందుకు పలు కాలేజీల యాజమాన్యాలు అడ్డదారులు తొక్కుతున్నాయి. ఇందుకోసం ఒకరికి బదులుగా మరొకరితో పరీక్ష రాయిస్తున్నాయి. జనగామ ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మంగళవారం జరిగిన ఓపెన్ డిగ్రీ బీకామ్ ఫస్టియర్ పరీక్షల్లో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తూ ఇద్దరు విద్యార్థులు పట్టుబడడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. యాదాద్రి భువనగిరికి చెందిన ఈ ఇద్దరూ భువనగిరిలోని ఒకే దూరవిద్య కేంద్రానికి చెందిన విద్యార్థులకు బదులుగా పరీక్ష రాశారు. దీంతో అదే కాలేజీ కేంద్రంగా ఈ దందా నడుస్తోందా? మిగతా అన్ని దూరవిద్యా కేంద్రాల్లోనూ ఇదే తంతు కొనసాగుతోందా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మంగళవారం పట్టుబడ్డ ఇద్దరు విద్యార్థులు పోలీసుల విచారణలో తాము ఓ మధ్యవర్తి ద్వారా ఈ పరీక్షకు హాజరయ్యామని చెప్పినట్లు సమాచారం. పరీక్ష రాసినందుకు ఒకరికి రూ.800, మరొకరికి రూ.500 చొప్పున మధ్యవర్తి ఇస్తామని చెప్పినట్లు తెలుస్తోంది. పోలీసుల ప్రాథమిక విచారణలో భువనగిరికి చెందిన సదరు కాలేజీ కరస్పాండెంట్ మధ్యవర్తిగా వ్యవహరించాడని తేలినట్లు తెలుస్తోంది. తమ కాలేజీలో చేరిన విద్యార్థులను పాస్ చేయించాలన్న ఉద్దేశంతో కరస్పాండెంట్ ఇలాంటి చర్యలకు పాల్పడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. కాకతీయ యూనివర్సిటీకి అనుబంధంగా ఉండే 'ఎస్‌డీఎల్‌సీఈ' (స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ లెర్నింగ్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్) పలు కాలేజీల్లో దూరవిద్యా కేంద్రాలకు అనుమతులు ఇస్తుంది. ఇందులో భాగంగా భువనగిరిలోని ఓ డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యం అదే కాలేజీలో దూరవిద్యాకేంద్రాన్ని నిర్వహిస్తోంది. ఇందులో చేరే విద్యార్థులకు పరీక్షల్లో పాస్ చేయిస్తామంటూ ముందస్తుగా హామీ ఇచ్చి వారి నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తోందని తెలుస్తోంది. పలు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణత తప్పనిసరి. దీనితో పాటు ఆయా ఉద్యోగాల్లో డిగ్రీ సర్టిఫికెట్ ఉంటేనే పదోన్నతులు సైతం దక్కుతాయి. ఈ కారణంతోనే చాలా మందికి ప్రస్తుతం డిగ్రీ ఉత్తీర్ణత అనివార్యమైంది. ఈ క్రమంలోనే వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

జనగామలో మంగళవారం పట్టుబడిన ఘటనకు సంబంధించి పరీక్ష రాసిన ఇద్దరు, రాయించిన ఇద్దరు విద్యార్థులపై జనగామ పోలీసులు 419, 420, టీఎస్ పబ్లిక్ ఎగ్జామినేషన్ ప్రివెన్షన్ ఆఫ్ మాల్ ప్రాక్టీసెస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఇదే క్రమంలో మధ్యవర్తిగా వ్యవహరించిన సదరు కాలేజీ అధినేతను సైతం పోలీసులు బుధవారం విచారించారు. కాగా.. మంగళవారం పట్టుబడిన విద్యార్థుల విషయాన్ని తొక్కి పెట్టేందుకు భువనగిరికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఈ విషయంపై మరింతగా కూపీ లాగితే భువనగిరిలో డొంక కదిలే అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరేది లేదు

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతగిరి, జూన్ 19: బీఆర్‌ఎస్ పార్టీని వీడేది లేదని, కాంగ్రెస్ పార్టీలో చేరేది లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టంచేశారు. బుధవారం ఆయన పర్వతగిరి మండలకేంద్రంలోని తన నివాసంలో పాలకుర్తి నియోజకవర్గ ముఖ్యనాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను పార్టీ మారుతున్నానని కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు కావాలని పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తు న్నారని మండిపడ్డారు. అమలు కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, హామీలు నెరవేర్చలేక ప్రభుత్వం బొక్కబోర్లా పడుతోందని అన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో దూసుకుపోయిందని, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన మాయమాటలు నమ్మి ప్రజలు గెలిపించారని, కానీ త్వరగానే వారికి తాము చేసిన తప్పేంటో అర్థమైందని అన్నారు. కేవలం బీఆర్‌ఎస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారన్నారు.

ఈ సందర్భంగా ఇటీవల వెల్లడైన లోక్‌సభ, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఫలితాలపై ఆయా ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలోని మండలాల వారీగా పోలైన ఓట్లు, ఓట్లశాతంపై ఆరాతీశారు. ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకూడదని సూచించారు. తనకు అండగా నిలిచిన ప్రతీ కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని భరోసా ఇచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ పూర్వవైభవం సంతరించుకుంటుందని, నాయకులు, కార్యకర్తలు కష్టపడి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని అన్నారు.

నిరసనలు.. నిలదీతలు

(5వ పేజీ తరువాయి)

చైర్‌పర్సన్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఎజెండా కాపీ చించివేత..

ప్రజల సొమ్మును కాజేయడానికే సమావేశాలు నిర్వహిస్తున్నారు తప్ప ప్రజలకు కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయడం లేదని 17వ వార్డు కౌన్సిలర్ జక్కుల అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వార్డులో విద్యుత్ స్తంభాలు వేయాలని ఎన్నిసార్లు కోరినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు మునిసిపల్ ఆమోదం పొందినప్పటికీ నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. ప్రజలకు ఉపయోగపడని సమావేశాలు వృథా అంటూ ఎజెండా కాపీలను చించి ఆమె సమావేశం నుంచి బయటకు వచ్చేశారు.

కటకటాల్లోకి ఖాకీ!

(5వ పేజీ తరువాయి)

ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

గతంలోనూ..

ఎస్సై భవానిసేన్‌గౌడ్ గతంలోనూ ఓ యువతిని వేధింపులకు గురి చేయడంతో సస్పెండ్ అయ్యారు. 2022, జూలై 12న ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన ఎస్సైగా పనిచేస్తున్న సమయంలో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి సిద్ధమవుతున్న ఓ యువతిని సాయం పేరుతో మభ్యపెట్టి పోలీస్ స్టేషన్‌కు రప్పించుకొని పలుసార్లు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. అప్పట్లో ఈ వ్యవహారాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో అధికారులు విచారణ జరిపి భవానీసేన్‌ను సస్పెండ్ చేశారు. అయితే, రాజకీయ పలుకుబడిని ఉపయోగించి కేవలం మూడు నెలల వ్యవధిలో తిరిగి పోస్టింగ్ సంపాదించుకున్నాడు. తదుపరి 16 ఫిబ్రవరి, 2024న మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఠాణాకు ఎస్సైగా వచ్చారు.

తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలి: సీపీఎం

జనగామ కల్చరల్, జూన్ 19: భూసమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేసిన చిలుపూర్ తహసీల్దార్ సరస్వతిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం సీపీఎం నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించిన రైతులపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా అక్రమ కేసులు పెట్టిన తహసీల్దార్ సరస్వతి, డీటీ విమలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ధరణి పోర్టల్ డీఎస్ పెండింగ్ భూసమస్యలు పరిష్కరించకుండా తహసిల్దార్, డీటీలు రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. మండలంలో ఖాళీగా ఉన్న సర్వేయర్ పోస్టును భర్తీ చేయాలన్నారు. రైతులు కోరిన వెంటనే పహాణీ నఖల్, పొజీషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. భూ సమస్యలపై సమగ్ర విచారణ జరిపి తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు అందించారు. కార్యక్రమంలో సీపీఎం చిలుపూర్ మండల కార్యదర్శి సాదం రమేష్, నాయకులు రాపర్తి రాజు, భూక్యా చందునాయక్, బాల్నె వెంకటమల్లయ్య, మంగ బీరయ్య, గుంటి బీమయ్య, రాజకుమార్, ఎల్.రమేష్, పి.పవన్, ఎ.అరుణ, శివకుమార్, రాజు, శంకర్, రాజు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో ఇక్ష్వాకుల కాలం నాటి నాణెం

చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి



గూడూరులో లభ్యమైన నాణెం, అరుదైన జైన పద్మావతీ దేవి విగ్రహం చూపుతున్న రత్నాకర్‌రెడ్డి

పాలకుర్తి, జూన్ 19 : పాలకుర్తి మండలం గూడూరులో ఇక్ష్వాకుల కాలం నాటి సీసంపై ముద్రించిన నాణెం లభ్యమైందని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన గూడూరు గ్రామంలో పాటిగడ్డ మీద ఇక్ష్వాకుల కాలం నాటి ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణెం వృత్తాకారంగా ఉందని, బొమ్మ వైపు గుఱ్ఱం ఉందని, గుఱ్ఱం ముందు అర్థ వృత్తాకరంగా శివ సేబకస అని బ్రాహ్మీలిపిలో రాసి ఉందని, గుర్రం కలిగిన నాణేలను మహాతలవర నాణాలని అంటారని అన్నారు. మహా తలవర అంటే గొప్ప కాపలాదారు అంటారని అన్నారు. బొరుసు వైపు రెండు కొండలు పైన మరొక కొండ కలిసి మూడు ఆర్చ్‌ల వలే ఉన్నాయని అన్నారు. ప్రతి కొండలోపల ఆరు చుక్కలు ఉండగా, కొండల కింది భాగంలో ఒక నది ఉందని తెలిపారు. ఇవన్నీ మొత్తం రెండు వరసల చతురస్రంతో చుట్టబడి ఉన్నాయని అన్నారు. నాణెం 5 గ్రాముల 834 మిల్లి గ్రాముల బరువు ఉందని చెప్పారు. నాణానికి ఒక రంధ్రం ఉందని దానిని లాకెట్‌గా ధరించే వారని తెలుస్తోందని అన్నారు. ఈ నాణెం గతంలో జనగామ జిల్లాలో పోలకొండ తవ్వకాల్లో లభించినట్లు వివరించారు. 1953లో సూర్యాపేట జిల్లా ఫనిగిరిలో పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల్లో 40 నాణాలు బయటపడ్డాని తెలిపారు. గూడూరులోని పాటిగడ్డ మీద నవీన శిలా యుగం నాటి రాతి పని ముట్లు, శాతావాహనుల కాలం నాటి చతురస్రాకారం రాతి కట్టడంతో ఉన్న చేదబావి, మట్టి పూజలు, బౌద్ధ మతానికి చెందిన సున్నపు బొమ్మలు, వైష్ణవ మతానికి చెందిన సన్నని రాతి పలకతో కూడిన చెన్నకేశవస్వామి, అంభారి ఏనుగు ఎక్కిన వీరుడు ఇలా అనేక శిల్పాలు ఉన్నాయని తెలిపారు. ఈ పరిశోధనలో తనకు మహా తలవర అనే పేరుతో పుస్తకం రాసిన ప్రొఫెసర్ చెన్నారెడ్డి, నాణాల సేకర్తలు కందుల వెంకటేష్, గిరిష్‌లు సహకరించారని అన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



బత్తుల కోమల (ఫైల్)

తరిగొప్పుల, 19: మండలకేంద్రంలో బుధవారం కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గయ్యపేట కాలనీకి చెందిన ఆవుల శ్యాం అదే కాలనీకి చెంది న బత్తుల కోమల (38)ను 17 సంవత్సరాల క్రితం ప్రేమించి వివాహం చేసుకోగా వారికి ఇద్దురు కూతుర్లు ఉన్నారు. అయితే శ్యాం మరొక స్త్రీతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను సరిగ్గా చూసుకోవడం లేదనే మనోవేదనతో బుధవారం తెల్లవారుజామున ఇంటి పక్కన గల రేకుల షెడ్డులో ఉరేసుకుంది. కాగా, తన కూతురు ఆత్మహత్యకు అల్లుడు శ్యాం ప్రధాన కారణమంటూ కోమల తండ్రి బత్తుల కొమురయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్వేత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

రఘునాథపల్లి, జూన్ 19: తల్లి తనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వీరారెడ్డి తండాకు చెందిన నూనావత్ సోనికి నలుగురు కుమారులుండగా భర్త కొమ్రు మృతి చెందాడు. సోని తనకున్న వ్యవసాయ భూమిని నలుగురు కుమారులకు సమానంగా పంచి ఇచ్చింది. వారు తల్లి సోనికి నెలకు ఒకరు చొప్పున పోషణార్థం బియ్యం ఇచ్చేటట్టు పెద్ద మనుషులు నిర్ణయించారు. బుధవారం సోని నాలుగో కుమారుడైన నూనావత్ రవి బియ్యం ఇవ్వాలి. ఈ విషయం అడిగినందుకు తల్లిని కొట్టాడు. దీంతో సోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు రవికి ఫోన్ చేసి స్టేషన్‌కు రావాలని చెప్పారు. దీంతో మనస్తాపం చెంది గడ్డి మందు తాగాడు. కుటుంబసభ్యులు వెంటనే 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, జూన్ 19: ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి బి.రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా లోని మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో పీజీటీ-బయోసైన్స్ ఉద్యోగ నియామకానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత సబ్జెక్టులో 50% మార్కులతో పీజీ పూర్తి చేసి, బీఈడీ అర్హత కలిగి 44 సంవత్సరాల వయసు లోపు ఉండి, బోధనలో 3 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. అర్హత కలిగిన వారు ఈ నెల 25లోపు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

హిందీ ఉపాధ్యాయ పోస్టుకు..

జఫర్‌గడ్, జూన్ 19 : జఫర్‌గడ్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఒక హిందీ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ దేవులపల్లి శ్రీకాంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు అవర్లీ బేస్డ్ (గంటల ప్రాతిపదికన) హిందీ సబ్జెక్టు బోధించడానికి అర్హతలు, అనుభవం కలిగిన పురుషులు, స్త్రీలు ఎవరైనా విద్యావంతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకు గాను అభ్యర్థులు బీఏ (హెచ్‌పీటీ), ఎంఏ (హెచ్‌పీటీ), లేదా ఎంఎస్సీ (హెచ్‌పీటీ) విద్యార్హతలు కలిగి ఉండాలన్నారు. అర్హత గల వారు ఈనెల 22వ తేదీ రోజున ఉదయం 11-30 గంటలకు ఆదర్శ పాఠశాలలో పాఠ్య బోధన పరీక్ష (డెమో), ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

గురుకులాల్లో టెండర్లకు ఆహ్వానం

జనగామ కల్చరల్, జూన్ 19: జిల్లా లోని తెలంగాణ మైనారిటీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో టెండరు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అదనపు జిల్లా కలెక్టర్(రెవెన్యూ) రోహిత్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను కిరాణం వస్తువులు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, చికెన్ సరఫరా చేయుటకు అర్హులైన టెండరుదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి కార్యాలయంలో ఫారం తీసుకొని ఎస్‌బీఐలో రూ.2 వేల డీడీ చెల్లించి దరఖాస్తు ఫారాలను ఈ నెల 28వ తేదీ లోగా కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



సాయిబాబా ఆలయంలో హారతిలో పాల్గొన్న భక్తులు

కొడకండ్ల, జూన్ 19: మండలకేంద్రంలో మాజీ ఎమ్మెల్యే దివంగత కుందూరు మధుసూదన్ రెడ్డి నిర్మించిన సాయిబాబా మందిర వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి కుమారుడు,ఆలయ ధర్మకర్త కుందూరు రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ వేదపండితులచే ఉదయం సాయిబాబా విగ్రహానికి పంచామృత, గంధ అభిషేకాలు, పుష్పార్చన, గణపతి, లక్ష్మీ గణపతి, నవగ్రహ, పూర్ణాహుతి నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు పిండిపోలు మౌర్య, దక్షిణామూర్తి, పాలకుర్తి గౌతం శర్మ, భక్తులు పేరం విజయవర్ధిని, శారద, పసునూరి మధుసూదన్, కిష్టయ్య, సాయి, వలబోజు ఉపేంద్రచారి, అరుణ, జిల్లా కల్పన, మరుద్వతి తదితరులు పాల్గొన్నారు.

21న ఆయుర్వేద వైద్య శిబిరం

జనగామ కల్చరల్, జూన్ 19: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వేద ఆయుర్వేదిక్ పంచకర్మ అండ్ వెల్‌నెస్ హాస్పిటల్ డాక్టర్ అంజిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైద్రాబాద్ రోడ్డు లోని వేద ఆయుర్వేద ఆసుపత్రిలో నిర్వహించే ఈ శిబిరంలో మెడ, నడుము, కీళ్ల నొప్పులు, చర్మ సంబంధిత, సైనస్ మొదలగు వ్యాధుల నివారణకు ఉదయం 10.30 గం.ల నుంచి మధ్యాహ్నం 1.00 గం.ల వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గలవారు 90000 97686 నంబరుకు కాల్ చేసి బుక్ చేసుకోవాలన్నారు.